క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో యజ్ఞోపవీతధారణ



యజ్ఞోపవీతధారణలో భక్తులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో గురువారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీ గాయత్రి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన వటువులకు ఉపాకర్మ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా ఆలయంలో నూతన యజ్ఞోపవీతధారణ కార్యక్రమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు బ్రహ్మశ్రీ దేవరకొండ లక్ష్మీనర్సింహ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు వెంకట కృష్ణారావు, ప్రధాన అర్చకులు లక్ష్మీగణపతిరావు, శ్రీనివాస ప్రసాద్, శేషుబాబు, శివరామప్రసాద్, లక్ష్మీ నర్సింహమూర్తి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు



మహేందర్‌రెడ్డితో నాయకులు

బడంగ్‌పేట్: పట్నం మహేందర్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం బడంగ్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నవీన్ ఠాకూర్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. మహేందర్



మహేందర్‌ను సన్మానిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కందుకూర్ మండలం బాచుపల్లి గ్రామానికి చెందిన మహేందర్ 'తెలంగాణ క్రాస్ బోలో' లో రెండో విజేతగా నిలిచాడు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత గురువారం మహేందర్‌ను సన్మానించి అభినందించారు. మరింత కష్టపడి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జంగయ్య, నాయకులు.. నాగరత్నం, శ్రీకాంత్, కిషోర్‌కుమార్ తదితరులున్నారు.

రుణమాఫీపై స్పష్టత లేదు

యాచారం: కేసీఆర్ సర్కార్ రూ. లక్ష లోపు రైతులందరికి వ్యవసాయ పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి రోజుల గడుస్తున్న నేటికి 70 శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని యాచారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీ చేస్తారని ఆశతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు న్యాయం చేయాలి

యాచారం: తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 104లో ఉన్న 250 ఎకరాల భూదాన్ భూమిని సాగుచేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమణ దారులకే పరిహారం అందజేశారని అన్నారు. ప్రభుత్వం అక్రమార్కులకు ఇచ్చిన పరిహారాన్ని రికవరీ చేసి రైతులకు పరిహారంతో పాటు 121 గజాల ఇంటి స్థలాల ప్రతాలను అందజేయాలని కోరారు.

యువకుడికి జైలు

చంచల్‌గూడ: మహిళను వేధించిన ఓ యువకుడికి నాంపల్లి కోర్టు 8 రోజుల జైలు శిక్ష విధించింది. మాదన్నపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేట బస్తీలో స్థానికులతో అసభ్యంగా వ్యవహరిస్తున్న శ్రీకాంత్ (30)పై పోలీసులకు ఫిర్యాదు అందడంతో అతని ఈ- పెట్టీ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లక్ష్మణరావు నిందితుడికి 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 15, వంకాయ 18, బెండ 23, పచ్చి మిర్చి 28, కాకర 23, బీర 23, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 32, దొండ 18, చిక్కుడు 45, గోకర 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 30, ఆలు 21, దోస 18, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 26, చామగడ్డ 28. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఘనంగా రాఖీ పండుగ

మహేశ్వరం: అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా గురువారం మంత్రి సబితారెడ్డి తన సోదరుడు నర్సింహారెడ్డి(బాబు)కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమిని అందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: మండల పరిధిలో రాఖీ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీ, స్వీట్ల షాపులు కిటకిటలాడాయి.

సరూర్‌నగర్ నియోజకవర్గంలో..

హుడాకాంప్లెక్స్: నియోజకవర్గం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మకు గురువారం మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనురాధ శర్మ, పుష్పమ్మ, సైదాబేగం, రుఖియా తదితరులు ఉన్నారు.

మహేశ్వరం మండలంలో..

మహేశ్వరం: రక్షా భంధన్ పండుగను మండల పరిధిలో గురువారం వైభవంగా నిర్వహించారు. అన్న, తమ్ముళ్లకు.. అక్కలు, చెల్లెళ్లు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటుకున్నారు. నియోజకవర్గంలోని నేతలకు వారివారి సోదరీమణులు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

జల్‌పల్లిలో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ, పహాడీ షరీఫ్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. జల్‌పల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్‌కు.. కవిత అనే మహిళ రాఖీ కట్టి మతసామరస్యాన్ని చాటిచెప్పింది.



హుడాకాంప్లెక్స్: అరవింద్‌శర్మకు మిఠాయి తినిపిస్తున్న మహిళలు



కందుకూరు: సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



హుడాకాంప్లెక్స్: తమ్ముళ్లకు రాఖీ కడుతున్న చిన్నారి



దిల్‌సుఖ్‌నగర్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



మహేశ్వరం: తమ్ముడికి రాఖీ కడుతున్న చిన్నారులు



పహాడీషరీఫ్: అఫ్జల్‌కు రాఖీ కడుతున్న కవిత

చెరువు కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలి



భవన శిథిలాలతో పూడ్చేస్తున్న పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువులో కొంతమంది భవన శిథిలాలు వేసి పూడ్చేస్తూ కబ్జాకు యత్నిస్తున్నారని, కబ్జా కాకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. పెద్దచెరువును పూడ్చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పెద్దచెరువు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. పెద్దచెరువులోని ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో గతంలో ప్రహరీ నిర్మించేందుకు యత్నించగా అడ్డుకున్నానని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో భవన శిథిలాలను వేస్తూ కబ్జాకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని మండిపడ్డారు. ఇరిగేషన్ అధికారుల అండతోనే కబ్జాదారులు కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కబ్జాదారులకు గుర్తించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా చెరువు ఎఫ్‌టీఎల్ స్థలం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

మహేశ్వరం: మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఐదు కులసంఘాల భవనాల నిర్మాణాలకు మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి శంకుస్థాపన చేయనున్నారని ఆ పార్టీ నేతలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు గట్టుపల్లి గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.కోటి 26లక్షలతో చేపట్టనున్న నూతన హాల్, వసతి గృహంపై మొదటి అంతస్తు షెడ్డు, ప్రహరీ నిర్మాణం పనులకు శంకుస్థాపన, రూ.16 లక్షలతో మండల పరిషత్ పాఠశాలలో మన ఊరు మనబడి కింద పలు కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అనంతరం పంచాయితీ భవనం వద్ద ఇండ్ల పట్టాల పంపిణీ, స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొంటారని నేతలు చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకాగలరని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

హస్తినాపురం: 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న ఓటును తప్పకుండా వినియోగించుగించుకోవాలని హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కంచర్ల శివారెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీనర్సింహపురం కాలనీ టీఎన్ఆర్ సులక్షణ అపార్ట్‌మెంట్‌లో కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో ఓటర్‌నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిఎన్ఆర్ సులక్షణ అపార్టుమెంట్ అధ్యక్షుడు అంబటి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రఘుమారెడ్డి, గోపాల్‌రెడ్డి, కార్యదర్శి రచ్చ సంతోష్, శేఖర్‌గౌడ్, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు చేయూత

తలకొండపల్లి: నిరుపేద ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నాడు. మండల పరిధిలో వెల్జాల్ గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటి నిర్మాణం ఆగిపోయింది. సింగిల్‌విండో వైస్ చైర్మన్ కూన రవికుమార్ ద్వారా విషయం తెలుసుకున్న వెంకటేశ్, లక్ష్మీదేవి ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్ తదితర సామగ్రిని గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎండీ నసీర్, కృష్ణయ్యగౌడ్, మల్లేశ్, గోపాల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్, స్టీల్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

పైప్‌లైన్ లీకేజీతో ప్రమాదాలు



పైప్‌లైన్ లీకేజీ కారణంగా ధ్వంసమైన రోడ్డు

హయత్‌నగర్: హయత్‌నగర్ నుంచి తొర్రూరు వెళ్లే దారిలో హయత్‌నగర్ జీ స్కూల్ మలుపు వద్ద ప్రధాన తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంత కాలంగా పైప్‌లైన్ లీకేజీ కారణంగా రోడ్డంతా ధ్వంసమైంది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు మూల మలుపు వద్ద ఏర్పడ్డ గుంతను గమనించకపోవడంతో ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి ప్రమాదాల బారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా గాయత్రిధారణ మహోత్సవం

మన్సూరాబాద్: పద్మశాలి సంఘం మన్సూరాబాద్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ శ్రీరామ్‌నగర్ కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గాయత్రిధారణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి పూజ నిర్వహించి గాయత్ర ధారణ చేశారు. అలాగే, సహారాస్టేట్స్ కాలనీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కాలనీలోని శ్రీలలితా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రి ధారణ చేశారు.



గాయత్రిధారణ పూజలో పాల్గొన్న పద్మశాలీ సంఘం నేతలు

క్రీడాకారుల సమస్యలపై పోరాటం

హుడాకాంప్లెక్స్: ఎస్ఎస్ఎఫ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ మెంబర్‌గా నందునాయక్ నియమితులయ్యారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ డే హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా రాజేష్ అధ్యక్షతన ఎస్ఎస్ఎఫ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్‌ను స్థాపించడం జరిగింది. గురువారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ పార్టీ స్పోక్స్‌పర్సన్ దాసోజు శ్రవణ్ హాజరై నందునాయక్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు అంటే భారతదేశానికి ఒక వెన్నుముక అని చాటి చెప్పడానికి, క్రీడాకారులకు అన్యాయం జరిగితే స్టూడెంట్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఉందని మనోధైర్యం నింపడానికి ఆర్గనైజేషన్ ప్రారంభించడం జరిగిందన్నారు. క్రీడాకారులకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించేందుకు స్టూడెండ్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పెద్దలకు నందు నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న నందునాయక్

వైద్యశిబిరాలతో నిరుపేదలకు మేలు

వనస్థలిపురం: ఉచిత వైద్య శిబిరాలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సుభద్రానగర్‌లో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో కాలనీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సొసైటీ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరగోపాల్, కాలనీ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పద్మజ, మదన్‌మోహన్ రావు, స్వర్ణలత, రాఘవరెడ్డి, నరసయ్య, హరినాథ్‌బాబు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గ్యాస్ ధర తగ్గించడంపై హర్షం



కడ్తాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను తగ్గించినందుకు బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి గురువారం పూలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షాబంధన్ కానుకగా ప్రధాని వంట గ్యాస్ ధరలను తగ్గించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భగీరథ, నాయకులు రమేశ్, యాదగిరి, సాయిలాల్ నాయక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం రూరల్: రక్షాబంధన్ కానుకగా దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గ్యాస్ ధరలు తగ్గించారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టి రాములు పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో బొంగ్లూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 200 తగ్గించడంతో 33 కోట్ల కుటుంబాలకు ఊరట లభించిందన్నారు. దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది ఉజ్వల లబ్ధిదారులకు రూ.400 భారం తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు వీరస్వామి, ప్రభాకర్‌గౌడ్, శివకుమార్, గణేశ్, యాదయ్య, శ్రీనివాస్, పద్మ, వరలక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

గోలి శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం



శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం పలువురు సత్కరించి అభినందించారు. హైదరాబాద్‌లో శ్రీనివాస్‌రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, ఆమనగల్లు వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, భారతి సిమెంట్స్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థికి అభినందనలు

మలక్‌పేట: ప్రపంచ స్థాయి థైయ్ బాక్సింగ్ పోటీలకు గడ్డిఅన్నారం నారాయణ పాఠశాల విద్యార్థి ఇంకెషాఫ్ మెహదీ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి 22 మంది జట్టు ఎంపికగా..వారిలో ఇంకెషాఫ్ మెహదీ జట్టు సభ్యుల్లో ఒకరని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థ తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు.

దుమ్ము రేగుతోంది..

- వాహనాల రాకపోకలతో ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, స్థానికులు
- అనారోగ్యం బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సాగర్ రహదారిపై పేరుకుపోయిన దుమ్ము

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో రోడ్లు దుమ్ము రేగుతున్నాయి. వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు వాపోతుంటే, దీనికి తోడు దుమ్ము, ధూళి వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. పేరుకే బీటీ, సీసీ రోడ్లు, అవి మట్టి రోడ్ల కంటే అధ్వానంగా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాతావరణంలో నిర్ణీత స్థాయిలో ఉండాల్సిన దుమ్ము, ధూళి కణాల సంఖ్య సాధారణం కంటే మించిపోయింది. దీంతో రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వసతుల కల్పనలో విఫలం

మున్సిపాలిటీలో 9 గ్రామాలతో పాటు 100కు పైగా కాలనీలు ఉన్నాయి. ప్రతి ఏటా కొత్త కాలనీలు విస్తరిస్తున్నాయి. ఇక్కడ నివసించే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. అందుకు తగ్గట్టుగా వసతుల కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మున్సిపాలిటీలో కేవలం 115 మంది మాత్రమే పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో నలుగురిని ఆఫీసులో అటెండర్లుగా, మిగతా కొందరిని హరితహారం, మల్టిపర్పస్ పనుల కోసం వినియోగిస్తున్నారు. మున్సిపాలిటీలో నివసించే జనాభా ఒకటిన్నర లక్ష వరకు ఉంటుందని అంచనా. చాలిచాలని సిబ్బందితో ప్రతి రోజు రోడ్లను శుభ్రం చేయించడం సాధ్యం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఊడ్చే యంత్రాలే లేవు

7 కిలోమీటర్ల మేర సాగర్ రహదారితో పాటు, సుమారు 600 కిలోమీటర్ల వరకు అంతర్గత రోడ్లను కలిగి ఉన్న మున్సిపాలిటీలో రోడ్లను ఊడ్చడానికి ఒక్క స్వీపింగ్ మిషన్ లేకపోవడం పాలకులు, అధికారుల నిర్లక్ష్యాన్ని రుజువు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వేగంగా అభివద్ధి చెందుతున్న నగరాల జాబితాలో తుర్కయంజాల్‌కు అవార్డు దక్కింది. ఈ అవార్డు రావడంతో మంత్రి కేటీఆర్ రూ. 2 కోట్ల నిధులను ప్రోత్సాహకంగా అందించారు. ఈ నిధులతో స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పారు. కానీ రోజులు గడుస్తున్న హామీ నెరవేరలేదు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి దుమ్ము, ధూళి లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం



సాగర్ రహదారిపై రోడ్లకు ఇరువైపులా డివైడర్ లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు పెద్ద ఎత్తున బురద చేరుతుంది. దీంతో వర్షాలు ఆగిపోయాక దుమ్ము, ధూళి పెద్ద ఎత్తున వ్యాపిస్తున్న మాట వాస్తవమే. ఈ సమస్యను పరిష్కరించేందుకు త్వరలోనే స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేస్తాం. ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ